

టన్ను చీనీ రూ.22 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.22 వేల ప్రకారం పలికాయి.



కిలో టమాట రూ.10

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.10, కనిష్టంగా రూ.6 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం

35.4°/12.6°

జిల్లా పరిధిలో మంగళవారం ఉదయం చలి వాతావరణం నెలకొంది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

రైతు విశిష్ట సంఖ్యను పొందండి

- డీఏఓ ఉమామహేశ్వరమ్మ



'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో పాల్గొన్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

ఉరవకొండ(వజ్రకరూర్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 14 అంకెల రైతు విశిష్ట సంఖ్యను పొందాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి(డీఏఓ) ఉమామహేశ్వరమ్మ రైతులకు సూచించారు. మంగళవారం వజ్రకరూర్ మండల పరిధిలోని రూపానాయక్‌తండా (వీపీపీతాండా)లో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, విత్తన, ఎరువుల రాయితీలు, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ వంటివి అందే అవకాశం ఉంటుందన్నారు. పట్టా పాసుపుస్తకం, ఆధార్‌తో పాటు ఆధార్ కార్డుకు లింక్ అయిన మొబైల్ నంబర్‌తో రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు. జిరాక్స్ పత్రాలు ఇచ్చిన రెండు రోజుల్లో 14 అంకెల నంబరు కేటాయిస్తారన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి మధుకర్, రైతుసేవా కేంద్రం సిబ్బంది ధాకునాయక్, రామకృష్ణనాయక్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

- ఎన్‌ఐసీ డైరెక్టర్ రవిశంకర్



అనంతపురం అర్బన్: సైబర్ నేరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ డైరెక్టర్ (ఐటీ) రవిశంకర్ సూచించారు. 'సురక్షితమైన ఇంటర్నెట్ దినోత్సవం' పురస్కరించుకుని మంగళవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ సమాచార, సాంకేతిక రంగంలో ఇంటర్నెట్ పాత్ర పెరుగుతోందన్నారు. రోజురోజుకూ ఈ రంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఈ క్రమంలోనే సైబర్ నేరాలు కూడా అధికమయ్యాయని, ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై పూర్తి అవగాహనతో ఉండాలని సూచించారు. అనంతరం రుణ యాప్‌లు, డిజిటల్ అరెస్టులు, ఆన్‌లైన్ లింక్ పంపి ఎలా మోసం చేస్తారు అనే అంశాలపై వివరించారు. ఎన్‌ఐసీ అభివృద్ధి చేసిన వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ భారతి, డీఐపీఆర్‌ఓ గురుస్వామిశెట్టి, ఎన్‌ఐసీ సిబ్బంది, విద్యార్థులు, ప్రభుత్వశాఖల ఉద్యోగులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన ఎండు మిర్చి ధరలు



మార్కెట్‌కు వచ్చిన ఎండు మిర్చి

హిందూపురం అర్బన్: ఎండు మిర్చి ధరలు పెరిగాయి. హిందూపురం వ్యవసాయ మార్కెట్‌కు మంగళవారం 94 క్వింటాళ్ల ఎండు మిర్చి వచ్చింది. ఈ–నామ్ ద్వారా వేలం వేయగా.. మొదటి రకం క్వింటాలు రూ.17 వేలు, రెండో రకం రూ.13,500, మూడో రకం రూ.7 వేలు పలికినట్లు మార్కెట్ కార్యదర్శి జి.చంద్రమౌళి తెలిపారు.

రోగులకు అసౌకర్యం లేకుండా చూడాలి

- సర్వజనాస్పత్రిని తనిఖీ చేసిన అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

అనంతపురం మెడికల్: రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న అనంతపురం సర్వజనాస్పత్రి సూపరింటెండ్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావును ఆదేశించారు. మంగళవారం ఆమె ఆస్పత్రిని తనిఖీ చేశారు. రోగులు ఎక్కడబడితే అక్కడ వాహనాలు నిలపకుండా చూడాలన్నారు. ఇందుకు అవసరమైన పార్కింగ్ స్థలంపై అధికారులతో చర్చించారు. ఆస్పత్రి ముందు ఉన్న తోపుడు బండ్లు, అనధికార వాహనాలను తరలించి పార్కింగ్ బయట ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందని ఆరా తీశారు. అనంతరం రోగులు, బంధువులు సేదదీరేందుకు విశ్రాంతి ధామం ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. ఆమె వెంట ఆస్పత్రి ఏడీ మల్లికార్జునరెడ్డి, ఆర్ఎంఓ, నర్సింగ్ సూపరింటెండెంట్ తదితరులు ఉన్నారు.

కిక్కు మాటున టోకరా



మద్యం ప్రియుల్ని బకరాలను చేసిన బాబు

- ధరలు తగ్గిస్తున్నట్టు గతంలో చెప్పి నేడు భారీగా పెంపు
- వైన్‌షాపుల నిర్వాహకులకు 14 శాతం మార్జిన్
- వినియోగదారులపై రోజుకు రూ.65 లక్షల భారం
- ఇప్పటికే బార్‌లను తలపిస్తున్న టీడీపీ నేతల వైన్‌షాపులు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: మద్యం ప్రియులకు కూటమి సర్కారు ఝలక్ ఇచ్చింది. పాలన చేపట్టిన తొలినాళ్లలో మద్యం ధరలు తగ్గిస్తున్నామని, నాణ్యమైన మద్యం సరఫరా చేస్తున్నామన్న సీఎం చంద్రబాబు.. 9 నెలలు కూడా పూర్తికాకుండానే మద్యం వినియోగదారుల నడ్డి విరిచారు. ఇప్పటికే పర్మిట్ రూములు, బెల్టుషాపులతో మద్యం ఏరులై పారుతుండగా దీన్ని ఆసరాగా చేసుకుని 15 శాతం మద్యం రేట్లు పెంచారు. ఇప్పటికే టీడీపీ ఎమ్మెల్యేలు దక్కించుకున్న మద్యం షాపులన్నీ బార్‌లను తలపిస్తున్న విషయం తెలిసిందే. దీనికితోడు తమ ఎమ్మెల్యేల కోసం 10 శాతం ఉన్న మార్జిన్‌ను.. 14 శాతానికి పెంచారు. మార్జిన్‌తో టీడీపీ నాయకులు, ఎమ్మెల్యేలు లాభపడుతున్నారు. మద్యం ధరలు పెంచి సర్కారూ ఆదాయ వనరులు పెంచుకుంది. మధ్యలో వినియోగదారులు పూర్తిగా నష్టపోతున్న పరిస్థితి నెలకొంది.

గడిచిన ఐదు మాసాల్లో ఉమ్మడి జిల్లాలో పరిస్థితి..	
మద్యం వినియోగం విలువ	రూ.581,86,73,002
మద్యం వినియోగం (లీటర్లలో)	72,30,004
బీర్‌ల వినియోగం (బాటిళ్లు)	2,66, 740
రోజుకు మద్యం వినియోగం విలువ	రూ.4 కోట్లు పైగా
అత్యధికంగా అనంతపురం అర్బన్‌లో	రూ.124,68,91,886

రోజుకు రూ.65 లక్షలు..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో పెరిగిన మద్యం ధరల కారణంగా రోజుకు సగటున రూ.65 లక్షల వరకూ వినియోగదారుడు నష్టపోవాల్సి వస్తుంది. ఇప్పటికే రోజూ రూ.4.50 కోట్లు మద్యం వినియోగమవుతోంది. ఇందులో 15 శాతం పెరిగితే రూ.67 లక్షలు అవుతుంది. సగటున రోజూ 6 లక్షల మందిపైగా మద్యం తాగుతున్నట్టు అంచనా. ఇందులో ఎక్కువమంది మధ్య తరగతి, దిగువ మధ్య తరగతికి చెందిన వారే ఉన్నారు. మరోవైపు, మద్యం షాపులు దక్కించుకున్న వారిలో 90 శాతం మంది టీడీపీ నాయకులే. వారికోసం నిన్నటిదాకా 9.5 శాతం ఉన్న మార్జిన్ మనీ 14 శాతానికి పెంచారు. దీంతో నెలకు రూ.కోట్లలో చెల్లించాల్సి వస్తుంది. మరోవైపు 15 శాతం పెంచడంతో సర్కారుకు ఉమ్మడి జిల్లా నుంచి నెలకు రూ.20 కోట్లకుపైగా అదనపు ఆదాయం సమకూరుతుంది. ఎటొచ్చీ నలుగుతోంది సామాన్యులే కావడం గమనార్హం.

యథేచ్ఛగా పర్మిట్‌రూములు, బెల్టు షాపులు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 236 వరకూ మద్యం షాపులున్నాయి. గతంలో మద్యం షాపుల్లో మందు కొనుక్కునే వరకే ఉండేది. ఇప్పుడు మాత్రం కొన్నచోటే తాగేలా అనధికార పర్మిట్ రూములు ఏర్పాటు చేశారు. పలువురు టీడీపీ ఎమ్మెల్యేలు బార్‌లను తలపించేలా యథేచ్ఛగా పర్మిట్ రూములు తెరిచారు. ఇక ప్రతి గ్రామంలో బెల్టుషాపులు వేలం పాటలు నిర్వహించి మరీ పెట్టడం కూటమి సర్కారు తీరుకు అద్దం పడుతోంది. ఈ క్రమంలోనే మద్యం రేట్ల పెంపుతో సామాన్యులు సర్కారుపై దుమ్మెత్తి పోస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో వివిధ బ్రాండ్‌ల ధరలు ఇలా

బ్రాండ్	మోతాదు	కొత్త ధర
ఓల్డ్‌మంక్ ఎక్స్‌ట్రా	180 ఎంఎల్	రూ.130
సియాగ్రామ్స్	180	రూ.160
వ్యాట్ 69	180	రూ.590
నెపోలియన్ కొరియర్	180	రూ.240
బ్లాక్ అండ్ వైట్ విస్కీ	180	రూ.620
బ్లాక్ డాగ్ విస్కీ	180	రూ.670
999 పవర్ స్టార్	180	రూ.160

జేఈఈ మెయిన్స్‌లో అదరహో

- భూపతి నితిన్ అగ్నిహోత్రికి 99.997 పర్సంటైల్




భూపతి నితిన్ అగ్నిహోత్రి, మహమ్మద్ ఆసిఫ్



భావన



విశాల్

అనంతపురం ఎడ్యుకేషన్: జేఈఈ మెయిన్స్ 2025 ఫలితాల్లో 'అనంత' విద్యార్థులు సత్తా చాటారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) మంగళవారం అధికారిక వెబ్‌సైట్‌లో ఫలితాలను విడుదల చేసింది. జనవరి 22 నుంచి 29 వరకు జేఈఈ మెయిన్ సెషన్-1 పరీక్షలు జరిగాయి. అఖిల భారతస్థాయిలో పలువురు విద్యార్థులు ప్రతిభ చాటారు.అనంతపురం నగరానికి చెందిన భూపతి నితిన్ అగ్నిహోత్రి 300 మార్కులకు 290 మార్కులతో 99.997 పర్సంటైల్ సాధించి శభాష్ అనిపించుకున్నాడు. గతంలో జిల్లాలో ఈస్థాయి పర్సంటైల్ ఎవరూ సాధించలేదని అధ్యాపకులు చెబుతున్నారు. అలాగే మహమ్మద్ ఆసిఫ్ 99.48 పర్సంటైల్, భావన 99.43 పర్సంటైల్, విశాల్ 99.36 పర్సంటైల్ సాధించి ప్రతిభను చాటారు.

ఇన్‌చార్జ్ డీఎస్‌ఓగా జగన్

అనంతపురం అర్బన్: పౌర సరఫరాల శాఖ ఇన్‌చార్జ్ డీఎస్‌ఓగా జగన్‌మోహన్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులను జారీ చేశారు. డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు ఆరోగ్య కారణాలతో సెలవుపై వెళ్లారు. దీంతో పౌర సరఫరాల సంస్థ డీఎం రమేష్‌రెడ్డికి తొలుత ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇచ్చారు. అయితే పౌర సరఫరాల శాఖ సిబ్బంది వేతనాల బిల్లు పెట్టే విషయంలో సమస్య వచ్చింది. రమేష్‌రెడ్డికి అథెంటికేషన్ లేని కారణంగా వేతన బిల్లులు నిలిచిపోయాయి. దీంతో శాఖ ఏఎస్‌ఓగా ఉన్న జగన్‌కు డీఎస్‌ఓగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

మద్యంపై ఉన్న శ్రద్ధ రైతులపై ఏదీ...?

- పంటకు గిట్టుబాటు ధర లేదు కానీ.. మద్యం ధరలు పెంచేశారు
- రైతులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: 'గడిచిన 9 నెలల్లో రూ. 1,26,000 కోట్ల అప్పులు చేశారు కానీ వ్యవసాయాన్నే నమ్ముకున్న రైతన్నను సీఎం చంద్రబాబు దగా చేశారు. ఇంత జరుగుతున్నా ఉమ్మడి జిల్లాలో ఉన్న ముగ్గురు మంత్రులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. అప్పుల సాకుతో హామీలను విస్మరిస్తే ఊరుకోం. మద్దతు ధర ఇవ్వలేదు కానీ మద్యం షాపుల నిర్వాహకులకు, ప్రభుత్వానికి ఆదాయం పెంచుకుంటున్న ఊసరవెల్లి చంద్రబాబుకు బుద్ధి చెబుతాం' అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. మంగళ వారం స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఆయన ధ్వజమెత్తారు. రైతులు పడుతున్న ఇబ్బందుల పట్ల మంత్రులు, ప్రజాప్రతినిధులు ఒక్క సమీక్ష అయినా చేశారా అని ప్రశ్నించారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు గత ప్రభుత్వం, అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతి మంగళవారాన్ని అప్పులవారంగా మార్చేసిందన్నారు. తమ ప్రభుత్వంలో 64 లక్షల మందికి పింఛన్లు అందిస్తే ఇప్పటికే ఈ ప్రభుత్వం 1.50 లక్షల పింఛన్లకు కోత పెట్టిందని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛన్ అందిస్తానని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్భాటంగా మద్దతు ధర ప్రకటించినా.. క్షేత్రస్థాయిలో రైతులకు ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదని, విత్తనాల ధరలు పడిపోవడమే ఇందుకు కారణమని 'అనంత' పేర్కొన్నారు

దోపిడీని పట్టించుకోరా?

ఫర్టిలైజర్స్, ఎరువుల దోపిడీ జరుగుతున్నా విజిలెన్స్, వ్యవసాయ శాఖాధికారులు పట్టించుకోవడం లేదన్నారు. మార్కెట్‌యార్డుల్లో కమీషన్ల దందా సాగుతోందని విమర్శించారు. భూగర్భ జలాలు ఇంకిపోతున్నాయని, హెచ్ఎల్‌సీ, హెచ్ఎన్ఎస్ఎస్ పరిసర ప్రాంతాల్లో మాత్రమే నీళ్లు ఉన్నాయన్నారు. భూగర్భ జలాలు ఇంకిపోతున్న తరుణంలో రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్య కూడా ఎదురవుతోందని, ఇప్పటికే శింగనమల, నార్పల, పామిడి మండలాల్లో నీటి ఇక్కట్లు ప్రారంభమయ్యాయన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్ర, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లెల వేణు, జేసీఎస్ జిల్లా కన్వీనర్ వెన్నం శివరామిరెడ్డి, పార్టీ నాయకులు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకూ మోసం

'ఎన్నికల ముందు బహిరంగ సభల్లో నాణ్యమైన మద్యం ఇస్తాం. బాగా తాగండి అని ప్రచారం చేసిన రాజకీయ నాయకుడు ఎవరైనా ఉన్నారా? అంటే అది చంద్రబాబే' అని అనంత గుర్తు చేశారు. నేడు అన్ని వర్గాలనూ మోసం చేసినట్లే మద్యం ధరలు పెంచి మందు బాబులనూ మోసగించారని దుయ్యబట్టారు. మద్యం వ్యాపారంలో మంత్రులు, ఎమ్మెల్యేలకు భాగస్వామ్యం ఉందన్నారు. అందుకే మార్జిన్ పెంచి దండుకునే ప్రయత్నం చేశారని విమర్శించారు. ప్రభుత్వానికి మద్యం ద్వారా ఏటా రూ.30వేల కోట్ల ఆదాయం వస్తోందని, 14 శాతం మార్జిన్ పెంచడం వెనుక ప్రభుత్వ అధినేత, వ్యాపారస్తులకు మధ్య అగ్రిమెంట్ జరిగిందని ఆరోపించారు. ముడుపులు తీసుకోవడంతో పాటు కర్ణాటక నుంచి మద్యం తెచ్చి బెల్ట్ షాపులకు తరలించి అక్రమార్జనకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు.

రాయదుర్గం టెక్స్‌టైల్ పార్కులో 47 యూనిట్ల రద్దు

- కలెక్టర్ వినోద్‌కుమార్



అనంతపురం అర్బన్: రాయదుర్గం టెక్స్‌టైల్ పార్కులో పనులు ప్రారంభించని 47 యూనిట్లను రద్దు చేసి, వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ చేయాలని కలెక్టర్ వి.వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయం నుంచి జూమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాయదుర్గం టెక్స్‌టైల్ పార్కులో యూనిట్ల ఏర్పాటు, తీర్మానం కోసం ఉంచిన అంశాలను కలెక్టర్‌కు జిల్లా చేనేత జౌళి శాఖ అధికారి శ్రీనివాసరెడ్డి వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ టెక్స్‌టైల్ పార్కులో సౌకర్యాలు కల్పించాలని కళ్యాణదుర్గం ఆర్‌డీఓ వసంతబాబును ఆదేశించారు. రాయదుర్గంలో యూనిట్లు నెలకొల్పేందుకు అరవింద్ కంపెనీ భూమి కోరుతోందని, టెక్స్‌టైల్ పార్కులో కానీ రాయదుర్గంలోని ఏపీఐఐసీ ఆధీనంలో ఉన్న భూముల నుంచైనా కేటాయించాలని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సుహానా సోనీని ఆదేశించారు. తదుపరి సమావేశం రాయదుర్గంలో ఏర్పాటు చేయాలని చెప్పారు. సమావేశంలో కమిటీ సభ్యులు ప్రసాద్, ఇబ్రహీం, రాయదుర్గం తహసీల్దారు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి

- డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి

కళ్యాణదుర్గం: ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి హెచ్చరించారు. స్థానిక ఆర్డీటీ ఎకాలజీ సెంటర్లో మంగళవారం కళ్యాణదుర్గం డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో ఉన్న ఆర్‌ఎంపీలు, పీఎంపీలతో సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి అందరూ కృషి చేయాలన్నారు. ఆర్‌ఎంపీలు, పీఎంపీలు పరిధి దాటి వైద్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రథమ చికిత్స కేంద్రాలను సీజ్ చేయడంతో పాటు పోలీసు చర్యలకు ఆదేశిస్తామని తెలిపారు. ప్రతి ఆర్‌ఎంపీ అర్హత పత్రాలను కలిగి ఉండాలన్నారు. పేర్లకు ముందు డాక్టర్ అని పెట్టుకోకూడదని సూచించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రులకు సిఫారసు చేయాలని చెప్పారు. అంతకుముందు డివిజన్ స్థాయిలో పనిచేస్తున్న వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలతో డీఎంహెచ్ఓ సమీక్ష నిర్వహించారు. టీకాలు, మాతా శిశు సంరక్షణ, స్కూల్ హెల్త్, క్యాన్సర్ స్క్రీనింగ్ తదితర కార్యక్రమాలు పక్కాగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ యుగంధర్, శిక్షకుడు త్యాగరాజు, ఆరోగ్య బోధనా అధికారి గంగాధర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ నోట్ల ముఠా అరెస్ట్

- రూ. 30 వేల నకిలీ నోట్లు, రూ. 20 వేల ఒరిజినల్ నోట్లు, రెండు బైక్‌ల స్వాధీనం
- సాంకేతికత సాయంతో ఆటకట్టించిన శ్రీ సత్యసాయి జిల్లా కదిరి పోలీసులు

పుట్టపర్తి టౌన్: నకిలీ నోట్ల చలామణి కేసులో కర్ణాటక ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి నకిలీ, ఒరిజినల్ నోట్లతో పాటు రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను మంగళవారం శ్రీ సత్యసాయి జిల్లా పోలీస్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో కదిరి రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ నిరంజన్‌రెడ్డితో కలిసి ఎస్పీ రత్న మీడియాకు వెల్లడించారు. కర్ణాటకకు చెందిన నలుగురు యువకులు నకిలీ నోట్ల చలామణితో సులువుగా డబ్బు సంపాదించాలనుకున్నారు. ఇందుకు గొర్రెల వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని పని మొదలు పెట్టారు. ఈ క్రమంలో జనవరి ఏడో తేదీన తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లి మార్కెట్ యార్డ్‌లో ఇద్దరు వ్యక్తుల వద్ద రెండు పొట్టేళ్లను రూ.30 వేలకు కొనుగోలు చేసి, రూ.500 నోట్లు 60 ఇచ్చి వెళ్లిపోయారు. అయితే ఆ నోట్లు నకిలీవని గుర్తించిన బాధితులు అదేరోజు సాయంత్రం కదిరి రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక టీం రంగంలోకి దిగింది. సీసీ ఫుటేజీలు సేకరించి.. సాంకేతిక ఆధారాలు విశ్లేషించి.. నిందితులు కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఇస్లావత్ పిరోలీనాయక్, దుంగావత్ రవినాయక్, ఎం.వి.ఆనంద్‌నాయక్, ఆదినారాయణ నాయక్‌గా గుర్తించారు. వీరిని మంగళవారం కుమ్మరవాండ్లపల్లి మార్కెట్ వద్ద అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.30వేల నకిలీ నోట్లు, రూ.20,500 ఒరిజినల్ నోట్లతో పాటు రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను కోర్టులో హాజరుపరిచారు. ముఠాలో కీలక సభ్యుల కోసం గాలిస్తున్నట్లు ఎస్పీ చెప్పారు. నిందితుల అరెస్టులో కీలకంగా వ్యవహరించిన సీఐ నిరంజన్‌రెడ్డి, సిబ్బంది విజయభాస్కర్, షాహీన, దామోదర్, కుమార్ నాయక్‌ను ఎస్పీ అభినందించి, క్యాష్ రివార్డులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.



ప్రత్యేక అలంకరణలో బొలికొండ రంగనాథుడు



శ్వేతగజ వాహనంపై కొండమీదరాయుడు

చూసిన కనులదే భాగ్యము

బుక్కరాయసముద్రంలో వెలసిన కొండమీద రాయుడు, గుత్తి మండలంలోని తొండపాడు గ్రామంలో కొలువైన బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కొండమీద రాయుడు శ్వేత గజవాహనంపై, రంగనాథుడు గజ వాహనంపై ఊరేగుతూ భక్తులను ఆశీర్వదించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆయా ప్రాంతాల్లో బుధవారం రథోత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. పెద్ద ఎత్తున తరలిరానున్న భక్తులను దృష్టిలో ఉంచుకుని నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. – బుక్కరాయసముద్రం/గుత్తి రూరల్

క్లుప్తంగా

జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ విజయలక్ష్మి

బుక్కరాయసముద్రం: మండలంలోని కొర్రపాడులో ఉన్న ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడా పోటీలకు అర్హత సాధించారు. ఈ మేరకు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తెలిపారు. ఇటీవల ఒడిశాలో జరిగిన రాష్ట్ర స్థాయి లాంగ్ జంప్, రోప్ పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థి నవ్యశ్రీ (8వ తరగతి) బంగారు పతకం, ఇందు (8వ తరగతి) వెండి పతకాన్ని సాధించారు. వీరు 13 నుంచి 15వ తేదీ వరకు మహారాష్ట్రలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల పీఈటీలు వరలక్ష్మి, తేజశ్విని, శ్యామలాదేవి, హేమ, శ్యామలమ్మ అభినందించారు.

తృటిలో తప్పిన ప్రమాదం

- 33 మంది కూలీలతో వెళ్తున్న లగేజీ వాహనం బోల్తా
- పలువురికి గాయాలు



బోల్తా పడిన ఆటో

డి.హీరేహాళ్(రాయదుర్గం): కూలీలతో వెళుతున్న వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ఘటనలో 33 మంది కూలీలు గాయపడ్డారు. వివరాలు.. డి.హీరేహాళ్ మండలం అశోకసిద్దాపురం, కల్యం, పల్లెపల్లి నుంచి మహిళా కూలీలు బళ్లారి, రూపనగుడి ప్రాంతాల్లో మంగళవారం ఎండు మిర్చి ఏరేందుకు లగేజీ వాహనంలో బయలుదేరారు. హొసగుడ్డం సమీపంలోకి చేరుకోగానే డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న 33 మంది మహిళా కూలీలు గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే బళ్లారిలోని విమ్స్‌కు తరలించారు. ఘటనపై ఎస్ఐ గురుప్రసాదరెడ్డి మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా లగేజీ వాహనంలో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

డిగ్రీ రెండు, నాలుగు సెమిస్టర్ ఫలితాల విడుదల

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ రెండు, నాలుగో సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. ఈ మేరకు ఎస్కేయూ డైరెక్టర్ ఆఫ్ ఇవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ ఓ ప్రకటనలో తెలిపారు. ఫలితాలు బుధవారం జ్ఞానభూమి పోర్టల్‌లో అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

క్రీడాకారుల అడ్డా... ఆత్మకూరు గడ్డ

- మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో ఆత్మకూరు వాసుల హవా
- జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక
- ఐదు పదుల వయసులోనూ తగ్గని ఉత్సాహం

ఆత్మకూరు: క్రీడాకారులకు అడ్డాగా ఆత్మకూరు ఖ్యాతి గడిస్తోంది. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఏ క్రీడా పోటీలు నిర్వహించిన ఆత్మకూరు వాసుల ప్రాతినిధ్యం తప్పనిసరిగా ఉండడమే ఇందుకు నిదర్శనం. ఇప్పటికే ఆత్మకూరులోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పలు క్రీడల్లో రాణిస్తుండగా... తాజాగా మాస్టర్స్ అథ్లెటిక్స్‌లోనూ తమకు ఎదురు లేదని పలువురు నిరూపించారు.

మైదానమే దేవాలయం

ఆత్మకూరు వాసులు చాలా మంది స్థానికంగా ఉన్న క్రీడా మైదానాన్ని పవిత్ర దేవాలయంగా భావిస్తుంటారు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం క్రమం తప్పకుండా మైదానికి చేరుకుని వాకింగ్, జాగింగ్‌తో పాటు వివిధ రకాల క్రీడలతో మానసికోల్లాసాన్ని పొందుతుంటారు. ఈ క్రమంలో పెద్దలను చూసి పిల్లలు కూడా అదే దారిలో నడుస్తున్నారు. చదువులతో పాటు క్రీడల్లోనూ రాణిస్తున్నారు. ఈ క్రమంలోనే క్రీడల కోటా కింద చాలా మంది ప్రభుత్వ ఉద్యోగాలు పొందారు. మరికొందరు దేశ రక్షణ దళాల్లో చేరి ఎంతో సంతోషంగా జీవితాన్ని గడుపుతున్నారు.

రాణించిన మాస్టర్స్

ఆధునికతతో పోటీ పడి పరుగులు తీస్తున్న నేటి సమాజంలో అందరూ యాంత్రిక జీవనానికి అలవాటు పడ్డారు. ఈ క్రమంలో పలు రుగ్మతల బారిన పడి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ పరిస్థితి నుంచి గట్టెక్కేందుకు మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలు దోహదపడుతున్నాయి. ఏటా ఏదో ఒక జిల్లాలో రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్‌ను నిర్వహించడం పరిపాటిగా మారింది. ఈ పోటీల్లో పాల్గొంటున్న ఆత్మకూరు వాసులు పలు క్రీడా అంశాలలో ప్రతిభ చాటి పతకాలు, ట్రోఫీలు, ప్రశంసా పత్రాలను కైవసం చేసుకుంటున్నారు. వారం రోజుల క్రితం అనంతపురం పీటీసీ క్రీడా మైదానం వేదికగా నిర్వహించిన మాస్టర్స్ అథ్లెటిక్స్‌లోనూ ఆత్మకూరు వాసులదే పైచేయిగా నిలవడం విశేషం. 30 నుంచి ఆపై వయసున్న వారు ఈ పోటీల్లో పాల్గొన్నారు. వీరిలో ఐదు పదుల వయసు దాటిన నలుగురు జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. వీరిలో ట్రిపుల్ జంప్, జావెలిన్ త్రోలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రథమ స్థానంలో నిలవగా... లాంగ్‌జంప్‌లో ద్వితీయ స్థానాన్ని దక్కించుకున్నాడు. అలాగే 200 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెంలో మహమ్మద్ షఫీ ప్రథమ స్థానం, 100 మీటర్ల పరుగు పందెంలో మూడో స్థానం, రిలే పరుగు పందెంలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. ట్రిపుల్ జంప్‌లో తైదల శివారెడ్డి ద్వితీయ స్థానం, జావెలిన్ త్రోలో బాలపోతన్న ప్రథమ స్థానం, వంద మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం, లాంగ్‌జంప్‌లో ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరు మార్చి 4 నుంచి 9వ తేదీ వరకు బెంగళూరులో జరిగే జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఏపీ తరఫున ప్రాతినిధ్యం వహిస్తుండడం గమనార్హం.



ఎస్పీ జగదీష్ చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న కానిస్టేబుల్ షఫీ (ఫైల్)



ట్రిపుల్ జంప్ చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

క్రీడా కోటాలోనే ఉద్యోగం వచ్చింది



మా ఊళ్లో పెద్దలు చాలా మంది ఉదయం, సాయంత్రం స్థానిక క్రీడా మైదానంలో పలు రకాల క్రీడలు ఆడుతూ ఉల్లాసంగా ఉండడం గమనించాను. నేను కూడా వారితో పాటు పాల్గొంటూ క్రీడా నైపుణ్యాలను అవరుచుకున్నా. ఇదే నన్ను ప్రభుత్వ ఉద్యోగిగా మార్చింది. 2008లో క్రీడా కోటా కింద కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించాను. ఇటీవల నిర్వహించిన మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవ్వడం ఎంతో ఆనందంగా ఉంది.

– షఫీ, జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెట్, ఆత్మకూరు

ఎక్కడైనా నేనే ఫస్ట్



దేశ వ్యాప్తంగా ఎక్కడ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించిన తప్పనిసరిగా పాల్గొంటా. ట్రిపుల్ జంప్‌లో ఇప్పటి వరకూ నేనే ఫస్ట్‌గా నిలవడం ఎంతో గర్వంగా ఉంది. 1997లో న్యూఢిల్లీ వేదికగా జరిగిన అథ్లెటిక్స్‌లో లాంగ్ జంప్ విభాగంలో పతకం సాధించా. 2000లో అమృత్‌సర్‌లో నిర్వహించిన అథ్లెటిక్స్‌లో ట్రిపుల్ జంప్ విభాగంలోనూ బంగారు పతకం నాదే అయింది. క్రీడా కోటాలోనే 2009లో పీఈటీగా ఉద్యోగం దక్కించుకున్నా.

– జగన్‌మోహన్‌రెడ్డి, జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెట్, ఆత్మకూరు

ఒకరిని చూసి మరొకరు



ఆత్మకూరు వాసులు ఎంతో మంది క్రీడా విభాగాల్లోనే ఉద్యోగాలు దక్కించుకున్నారు. ఐదు పదుల వయసులోనూ మేము రోజూ స్థానిక మైదానంలో వివిధ రకాల క్రీడలు ఆడుతుంటాం. ఇది చూసి ఒకరి తర్వాత మరొకరు మాతో పాటు క్రీడల్లో పాల్గొంటూ రోజంతా ఎంతో ఉత్సాహంగా గడుపుతున్నారు. రాష్ట్రంలో ఎక్కడ ఏ క్రీడలు జరిగినా ఆత్మకూరు వాసులు తప్పనిసరిగా పాల్గొని విజేతలుగా తిరిగి వస్తుండడం ఎంతో గర్వంగా ఉంది.

– తైదుల శివారెడ్డి, జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెట్, ఆత్మకూరు

అధినేతతో గోరంట్ల మాధవ్ భేటీ



అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ మంగళవారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని ఆయనకు వైఎస్ జగన్ సూచించారు.

టీడీపీ నేతల దుశ్చర్య



మంటలు ఆర్పేందుకు వచ్చిన ఫైర్ ఇంజిన్

బుక్కరాయసముద్రం: మండలంలోని కొర్రపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త తోటకు స్థానిక టీడీపీ నాయకులు నిప్పు పెట్టారు. బాధితుడు తెలిపిన మేరకు కొర్రపాడుకు చెందిన రైతు పరమేష్ తనకున్న 2.86 ఎకరాల్లో 500 చీనీ చెట్లను సాగు చేస్తున్నాడు. రస్తా విషయంగా టీడీపీ కార్యకర్తలు పరమేష్, తలారి నాగభూషణ, నాగేంద్ర, హరితో ఆయనకు కొంత కాలంగా వివాదం నడుస్తోంది. ఈ క్రమంలోనే ఆయనపై పలుమార్లు దాడులు జరిగాయి. ఈ క్రమంలోనే మంగళవారం పరమేష్ తోటకు నాగభూషణ, నాగేంద్ర, హరి నిప్పు పెట్టారు. దీంతో 450 చెట్లు, డ్రిప్ పరికరాలు కాలిపోయాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు ఆర్పేలోపు రూ.5 లక్షల మేర నష్టం వాటిల్లింది. ఘటనపై పోలీసులకు బాధిత రైతు ఫిర్యాదు చేశాడు.

ఏఆర్ కానిస్టేబుల్ ఘరానా మోసం

- అప్పు చెల్లించినా.. ప్లాట్ తిరిగివ్వని వైనం
- న్యాయం కోసం ఎస్పీని ఆశ్రయించిన బాధితుడు



వృద్ధునితో మాట్లాడుతున్న శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: ఏఆర్ కానిస్టేబుల్ వలి ఘరానా మోసం వెలుగులోకి వచ్చింది. తనకు న్యాయం చేయాలని అనంతపురానికి చెందిన బాధితుడు శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీని కలసి వేడుకున్నాడు. వలి గతంలో అనంతపురంలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పని చేశాడు. అప్పట్లో వెంకటనారాయణ అనే వ్యక్తి అవసరాల నిమిత్తం వలితో రూ.6లక్షలు అప్పుగా తీసుకుని ష్యూరిటీ కింద అనంతపురం సమీపంలోని ఉప్పరపల్లి రెవెన్యూ పరిధిలో తనకున్న ఐదు సెంట్ల ప్లాట్‌ను ఆయకవు రిజిస్ట్రేషన్ చేయించాడు. కొద్ది రోజుల క్రితం వెంకటనారాయణ అసలు–వడ్డీ చెల్లించి ప్లాట్‌ను తిరిగి తన పేరుపై రిజిస్ట్రేషన్ చేయాలని కోరాడు. అయితే ఆ స్థలంతో నీకు సంబంధం లేదంటూ వలి ఎదురుతిరిగాడు. మనో వేదనకు గురైన వెంకటనారాయణ కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడు. అయినా కానిస్టేబుల్‌కు కనికరం కలగలేదు. ఆ ప్లాట్‌ను ఇతరులకు అమ్మి రిజిస్ట్రేషన్ చేయించాడు. ఇప్పుడు తనకు కూడా ఆరోగ్యం సరిగా లేదని, వయసు మీద పడిందని, న్యాయం చేయాలని వెంకటనారాయణ మంగళవారం సాయంత్రం ఎస్పీ రత్నను కలిసి వేడుకున్నాడు. స్పందించిన ఎస్పీ.. రెండు రోజుల్లో విచారణ చేయించి.. న్యాయం చేస్తానని భరోసానిచ్చారు.

అడ్డుగా ఉన్నాడని... అంతం చేసింది

- దేవరకొండ కాశప్ప హత్య కేసులో వీడిన మిస్టరీ
- హతుడి భార్యతో పాటు మరో ఇద్దరి అరెస్ట్



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న సీఐ శేఖర్

రాప్తాడు రూరల్: ఇటీవల అనంతపురం నగర శివారున 44వ జాతీయ రహదారి పక్కన చింతతోపులో జరిగిన దేవరకొండ కాశప్ప హత్య కేసులో మిస్టరీని అనంతపురం రూరల్ పోలీసులు ఛేదించారు. ప్రియుడిపై మోజుతో కట్టుకున్న భార్యనే కాశప్పను హతమార్చినట్లుగా నిర్ధారణ కావడంతో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం అనంతపురం రూరల్ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను సీఐ శేఖర్ వెల్లడించారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం మండలం మల్కాపురం గ్రామానికి చెందిన దేవరకొండ కాశప్ప అలియాస్ కాశి, సౌభాగ్య దంపతులు. అనంతపురం రూరల్ పరిధిలోని కక్కలపల్లి టమాట మండీలో కూలీలను ఏర్పాటు చేసే మేస్త్రీ పనితో జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో కాశప్ప రెండు నెలల క్రితం చీరల వ్యాపారం కోసమని హైదరాబాద్‌కు వెళ్లాడు. అప్పటి నుంచి టమాట మండీలో కూలీలతో సౌభాగ్య పనులు చేయిస్తూ వచ్చింది. ఆమె పర్యవేక్షణలో కర్ణాటకలోని కోలార్ ప్రాంతానికి చెందిన నవాజ్ బేగ్, గౌస్ పీర్ పనికి కుదిరారు. ఈ పరిచయం కాస్త సౌభాగ్య, నవాజ్ బేగ్ మధ్య వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ విషయం టమాట మండీలో అందరితో పాటు భర్తకూ తెలిసిపోయింది. దీంతో ఆయన భార్యను తీవ్ర స్థాయిలో మందలించాడు. అయితే తమ వివాహేతర సంబంధానికి భర్త అడ్డు చెప్పడాన్ని సౌభాగ్య జీర్ణించుకోలేకపోయింది. ఎలాగైనా కాశప్పను హతమార్చి ఇద్దరూ కలసి జీవించాలనుకున్నారు. ఈ క్రమంలో పథకం ప్రకారం నవాజ్, గౌస్ ఇద్దరూ కాశప్పను పార్టీ చేసుకుందామని ఈ నెల 2న చింత తోపులోకి పిలుచుకెళ్లారు. అక్కడ కాశప్పతో ఫుల్‌గా మద్యం తాగించిన అనంతరం బీరు బాటిళ్లు, రాళ్లతో దాడి చేసి హతమార్చారు. అదే రోజు సాయంత్రం అటుగా వెళ్లిన స్థానికుల సమాచారంతో అనంతపురం రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. సౌభాగ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో సౌభాగ్య ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో అసలు విషయం వెలుగు చూసింది. దీంతో మంగళవారం ఆర్డీటీ స్టేడియం వద్ద తచ్చాడుతున్న సౌభాగ్య, నవాజ్‌బేగ్, గౌస్‌పీర్‌ను అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి హతుడి పల్సర్ బైక్, మూడు సెల్‌ఫోన్లు, హత్యకు ఉపయోగించిన రెండు బండరాళ్లు, రక్తం మరకలు అంటిన టీషర్టులు స్వాధీనం చేసుకున్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

గుంతకల్లు టౌన్: పట్టణంలో గంజాయిని విక్రయిస్తున్న షికారీ నాగరాజును వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి ఒక కిలో బరువున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీఐ మనోహర్ తెలిపిన మేరకు... షికారీ కాలనీకి చెందిన నాగరాజు ఒడిశాలోని భువనేశ్వర్‌లో రూ.10 వేలు వెచ్చించి ఒక కిలో గంజాయిని కొనుగోలు చేసి, అక్రమంగా గుంతకల్లుకు తీసుకొచ్చేవాడు. అనంతరం ఆ గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లుగా మార్చి అధిక ధరకు విక్రయించి సొమ్ము చేసుకునేవాడు. అందిన పక్కా సమాచారంతో మంగళవారం ఉదయం నాగరాజును ఇంటిని పోలీసులు ఆకస్మిక తనిఖీ చేశారు. ఆ సమయంలో గంజాయి పట్టుబడింది. నిందితుడిని అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేయాలి

గుంతకల్లు రూరల్: ప్రతి నెలా లబ్ధిదారుల ఇంటి వద్దనే రేషన్ పంపిణీ చేయాలని ఎండీటీ ఆపరేటర్లను జిల్లా ఇన్‌చార్జ్ పౌరసరఫరాల అధికారి జగన్‌మోహన్ ఆదేశించారు. గుంతకల్లు మండలం నెలగొండ గ్రామంలో గత కొన్ని నెలలుగా ఇంటింటికీ రేషన్ సరఫరా నిలిచిపోవడం, గ్రామంలోని వృద్ధులు, వికలాంగులు రేషన్ డీలర్ వద్దకెళ్లి సరుకులు తీసుకునేందుకు పడుతున్న ఇబ్బందులపై ఇటీవల కలెక్టర్, జేసీ, డీఎస్ఓకు గ్రామస్తులతో కలసి 'ధర్మ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్' రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వీరాంజినేయులు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో ఇన్‌చార్జ్ డీఎస్ఓ మంగళవారం ఉదయం సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మితో కలసి ఆ గ్రామంలో పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడి ఇంటింటికీ రేషన్ పంపిణీపై ఆరా తీశారు. వచ్చే నెల నుంచి ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మిని ఆదేశించారు.

శిరీష ఆత్మహత్యపై డీఎస్పీ విచారణ



విచారిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన శిరీష ఆత్మహత్యపై డీఎస్పీ శ్రీనివాసరావు మంగళవారం విచారణ చేపట్టారు. ఇదే గ్రామానికి చెందిన వంశీ వేధింపులు తాళలేక తమ కూతురు బలవన్మరణానికి పాల్పడిందని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు...వంశీపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. ఈ క్రమంలో మంగళవారం డీఎస్పీ విచారణకు వచ్చారు. శిరీష ఉరి వేసుకున్న గదిని పరిశీలించారు. చుట్టుపక్కల వారితో మాట్లాడారు. ఎంతకాలం నుంచి వేధింపులు ఉన్నాయంటూ తల్లిదండ్రులతో ఆరా తీశారు. నిందితుడికి కోర్టు ద్వారా శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తమపై అనేక రకాలుగా దాడులు, దౌర్జన్యాలు జరుగుతున్నాయని పలువురు దళితులు డీఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. ఫిర్యాదు చేస్తే విచారించి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. డీఎస్పీ వెంట ఎస్ఐ విజయ్ కుమార్, ఎస్సీ ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి ఉన్నారు.

జీజీహెచ్‌లో బాలింత మృతి



మృతురాలు తిప్పమ్మ

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రి (జీజీహెచ్)లోని అక్యూట్ మెడికల్ కేర్ యూనిట్‌లో (ఏఎంసీ) మంగళవారం ఓ బాలింత మృతి చెందింది. వివరాలు.. బ్రహ్మసముద్రం మండలం భైరవసముద్రం గ్రామానికి చెందిన రాయప్పగారి హనుమంతప్ప, తిప్పమ్మ(32) దంపతులు. మూడో కాన్పు కోసం ఈ నెల 10 కళ్యాణదుర్గంలోని ఆర్డీటీ ఆస్పత్రి నుంచి జీజీహెచ్‌కు తిప్పమ్మ రెఫర్ అయింది. పరీక్షించిన గైనిక్ వైద్యులు.. బీపీ ఎక్కువగా ఉన్నట్లు నిర్ధారణ కావడంతో చికిత్స మొదలు పెట్టారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం 11.50 గంటలకు సిజేరియన్ చేసి, పండంటి ఆడశిశువును వెలికి తీశారు. ఈ క్రమంలో గర్భసంచి ముఖద్వారంలో మాయ అతుక్కుని ఉండడం గుర్తించి చికిత్స అందిస్తున్న సమయంలో కార్డియాక్ అరెస్ట్‌తో బాలింత మృతి చెందింది. ప్రస్తుతం పసికందు ఎస్ఎన్‌సీయూలో ఉంది.

బాలిక ప్రసవం!

గార్లదిన్నె: లైంగిక దాడికి గురైన బాలిక సోమవారం రాత్రి పండంటి ఆడశిశువుకు జన్మనిచ్చింది. వివరాలు.. ఉరవకొండ ప్రాంతానికి చెందిన ఓ నిరుపేద కుటుంబం కొన్నేళ్లుగా గార్లదిన్నెలోని ఇందిరమ్మ కాలనీలో గుడిసె వేసుకుని నివాసముంటోంది. వీధుల్లో సంచరిస్తూ చెత్త సేకరించి గుజరీకి వేయడం ద్వారా వచ్చే ఆదాయంతో జీవనం సాగించేవారు. వారి కుమార్తెపై కన్నేసిన స్థానిక యువకుడు మాయమాటలతో ఆమెను లోబర్చుకుని పలుమార్లు అత్యాచారం జరిపాడు. ఈ క్రమంలో కొన్ని రోజుల క్రితం కడుపు నొప్పితో బాధపడుతున్న బాలికను తల్లిదండ్రులు ఆస్పత్రికి పిలుచుకెళ్లి చూపించారు. పరీక్షించిన వైద్యులు ఆ బాలిక గర్భంతో ఉన్నట్లుగా నిర్ధారించడంతో అసలు విషయాన్ని బాధితురాలి ద్వారా రాబట్టుకున్న తల్లిదండ్రులు ఈ నెల 6న పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి బాలిక అనంతపురంలోని సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతూ వచ్చింది. సోమవారం రాత్రి పురిటి నొప్పులతో బాధపడుతూ ఆడశిశువుకు జన్మనిచ్చింది.

మూతపడిన అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన పీడీ



గ్రామస్తులతో మాట్లాడుతున్న పీడీ వనజ అక్కమ్మ

కుందుర్పి: వారం రోజుల క్రితం మూతపడిన కెంచంపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ పీడీ వనజ అక్కమ్మ, సూపర్‌వైజర్ లక్ష్మీదేవి తదితరులు మంగళవారం పరిశీలించారు. రాజకీయ కక్షతో అంగన్‌వాడీ కేంద్రానికి స్థానిక టీడీపీ నేతలు తాళం వేసిన విషయం తెలిసిందే. ఈ నెల 6న సెంటర్ ఎదుట ఇద్దరు వ్యక్తులు గొడవ పడుతుండడంతో ఆయా సుగుణ, కార్యకర్త సుమిత్ర సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. గొడవలో వ్యక్తులు పరస్పరం విసురుకున్న మట్టి పెళ్ల తగిలి ఆయాకు రక్తగాయమైంది. అయితే ఈ గొడవకు అంగన్‌వాడీ సిబ్బందినే కారణమంటూ స్థానిక టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తంచేస్తూ కార్యాలయానికి తాళం వేశారు. కాగా, 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ప్రస్తుతమున్న కార్యకర్త, ఆయాను నియమించుకున్న టీడీపీ నేతలే, తాజాగా వారిని విధుల నుంచి తొలగించాలంటూ మంగళవారం పీడీ వనజ అక్కమ్మను డిమాండ్ చేశారు. ఈ విషయమై పీడీ మాట్లాడుతూ. అంగన్‌వాడీ సెంటర్‌కు తాళం వేసిన అంశానికి సంబంధించిన పూర్వాపరాలను విచారణ చేశామని, దీనిపై నివేదిక సిద్ధం చేసి కలెక్టర్‌కు అందజేస్తామని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

తాడిపత్రి రూరల్: స్థానిక పెన్నానది ఒడ్డున బైపాస్ రోడ్డులో మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో రెండు మోటర్ సైకిళ్లు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. మృతుడిని తాడిపత్రిలోని బంకమడి వీధికి చెందిన చాకలి రాముడు (48)గా గుర్తించారు. ఇదే ఘటనలో శ్రీనివాసపురానికి చెందిన మల్లికార్జున, జాఫర్‌కు గాయాలయ్యాయి. వ్యక్తిగత పనులు చూసుకుని స్వస్థలాలకు రాముడుతోపాటు మరో వ్యక్తి మోటర్ సైకిల్‌పై వెళుతుండగా ఎదురుగా మరో మోటర్‌సైకిల్‌లో జాఫర్, మల్లికార్జున వస్తు ఢీకొన్నారు. వెంటనే రాముడు మోటర్ సైకిల్‌లో ఉన్న వ్యక్తి అక్కడి నుంచి పరారయ్యాడు. ప్రమాదంలో గాయపడిన ముగ్గురినీ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ చాకలి రాముడు మృతి చెందాడు. ఆయనకు భార్యతో పాటు పిల్లలు ఉన్నారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ముళ్ల పొదల్లో పసికందు

బత్తలపల్లి: తల్లి పొత్తిళ్లలో ఉండాల్సిన పసికందు ముళ్ల పొదల్లో ప్రత్యక్షమైంది. ప్లాస్టిక్ కవర్లో చుట్టి ఉన్న పసికందును కుక్కలపాలవకుండా ఓ వృద్ధురాలు రక్షించింది. అనంతరం స్థానికంగా నివాసముంటున్న దంపతులు శిశువును అక్కున చేర్చుకున్నారు. మండల కేంద్రం బత్తలపల్లిలోని మారుతీనగర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. బీసీ గురుకుల పాఠశాల వెనుక.. అంగన్‌వాడీ కేంద్రం పక్కన గల ముళ్ల పొదల సమీపంలో మంగళవారం ఓ వృద్ధురాలు చెత్త ఊడుస్తోంది. ఆ సమయంలో కొన్ని కుక్కలు అటుగా వచ్చి ప్లాస్టిక్ కవర్ మూటను తెరిచే ప్రయత్నం చేశాయి. వృద్ధురాలు గమనించి వాటిని తరిమి.. కవర్‌ను కదిపి చూగా బరువుగా అనిపించింది. ఆమె స్థానికంగా ఉన్న ఓ ముస్లిం దంపతులను అక్కడకు తీసుకొచ్చింది. వారు ఆ కవర్‌ను తెరవగా మాయతో పాటు రక్తపు మరకలతో ఉన్న మగ శిశువు కనిపించింది. వెంటనే ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు శిశువును శుభ్రం చేశారు. బరువు తక్కువగా ఉన్న శిశువు ఊపిరి తీసుకోవడానికి ఇబ్బంది పడుతుండటంతో సీపీఆర్ చేసి వెంటిలేటర్ అమర్చారు. అనంతరం విషయాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రమ్మకు చేరవేశారు. తమకు ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారని, ఈ మగ శిశువును తాము పెంచుకుంటామంటూ ముస్లిం దంపతులు ముందుకొచ్చారు.

ఈ పాపం ఎవరిది?

శిశువును ముళ్లపొదల్లో పడేయడంపై ప్రజలు మండిపడుతున్నారు. పెళ్లికి ముందే గర్భం దాల్చి ప్రసవమై సమాజానికి సమాధానం చెప్పలేక ఇలా వదిలించుకున్నారా.. లేక పసికందును ఎవరైనా తీసుకొచ్చి పడేశారా.. అన్నది తెలియడం లేదు. ఏది ఏమైనా కర్కశంగా ఇలా పసికందును పడేయడమేంటని శాపనార్థాలు పెడుతున్నారు. వృద్ధురాలు గమనించకపోయి ఉంటే ఊపిరాడకుండా లేదా కుక్కలపాలై శిశువు మరణించేదని పలువురు చర్చించుకోవడం కనిపించింది.

క్లుప్తంగా

మాజీ సీఎంను కలిసిన వెన్నపూస రామచంద్రారెడ్డి



వైఎస్ జగన్‌తో వెన్నపూస రామచంద్రారెడ్డి

అనంతపురం మెడికల్: విజయవాడలో మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం అనంతపురం జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు మాజీ చైర్మన్ వెన్నపూస రామచంద్రారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ సీఎం వైఎస్ జగన్‌కు ఆయన పుష్పగుచ్ఛం అందించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



అతిథులను సత్కరిస్తున్న మహిళా ప్రొఫెసర్లు

అనంతపురం: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రిన్సిపల్ సైంటిస్ట్ ప్రొఫెసర్ మల్లీశ్వరి అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో 'ఇంటర్నేషనల్ డే ఆఫ్ ఉమెన్ అండ్ గరల్స్ ఇన్ సైన్స్' దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఫిజిక్స్ విభాగాధిపతి డాక్టర్ జరీనా ఆధ్వర్యంలో సాంకేతిక సదస్సు నిర్వహించారు. విశిష్ట అతిథులుగా శ్రీ సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్ ప్రొఫెసర్ దీపా సీతారామన్ హాజరై విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. కాలానుగుణమైన మార్పుకు అనుగుణంగా సాంకేతిక విద్యను అభ్యసించాలన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇంజినీరింగ్, మేథమేటిక్స్ ప్రాముఖ్యాన్ని వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మాధవి, ఉమెన్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ అజిత, ప్రొఫెసర్ పద్మ సువర్ణ, ప్రొఫెసర్ వీబీ చిత్ర, ప్రొఫెసర్ శైలా కుమారి పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణులకు భోజనం వడ్డిస్తున్న సిబ్బంది

రాప్తాడు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శివకృష్ణ గర్భిణులకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. ఏఎన్‌ఎంలు మగ్దలీనా, విజయశ్రీ గర్భిణులకు భోజన వసతి కల్పించారు. సీహెచ్‌ఓ శివప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్లు నరసింహ, అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

అహుడా లేఅవుట్ల అభివృద్ధికి చర్యలు



మాట్లాడుతున్న అహుడా వైస్ చైర్మన్ శివనారాయణ్ శర్మ, చిత్రంలో చైర్మన్ వరుణ్

అనంతపురం కార్పొరేషన్: అనంతపురం, హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(అహుడా) లే అవుట్లలో అభివృద్ధికి పటిష్ట చర్యలు తీసుకోవాలని అహుడా చైర్మన్ వరుణ్, వైస్ చైర్మన్ శివ్ నారాయణ్ శర్మ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని అహుడా కార్యాలయంలో పబ్లిక్ హెల్త్ ఇంజినీర్లతో వారు సమీక్ష నిర్వహించారు. అనంతపురం, కోడూరు, ధర్మవరం లే అవుట్లపై సమీక్ష నిర్వహించారు. ఆయా లే అవుట్ల పరిధిలో ఆహ్లాదకరమైన వాతావరణం, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ప్లాట్ కొన్న ప్రతి ఒక్కరికీ భద్రతతో పాటు మెరుగైన వసతులు కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో అహుడా కార్యదర్శి గౌరి శంకర్ రావు, ఈఈ దుశ్యంత్, పీఓ ఇసాక్ అహ్మద్, జూనియర్ ప్లానింగ్ ఆఫీసర్ హరీష్‌చౌదరి, డీఈలు రేవంత్ కుమార్ రెడ్డి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ఆత్మకూరు: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఎస్‌ఐ లక్ష్మీనారాయణ విద్యార్థులకు సూచించారు. మంగళవారం స్థానిక కస్తూర్బా పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, బాల్య వివాహాల నియంత్రణపై అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం ఇవ్వరాదన్నారు. బాల్య వివాహాలు చేసినా, వాటిని ప్రోత్సహించినా చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. బాల్య వివాహాలు చేస్తే అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలియజేశారు. కేజీబీవీ ప్రత్యేకాధికారిణి లీమారోజ్, మహిళా పోలీసులు అనురాధ, షబానా పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఆదాయానికి గండి

- 15 నిమిషాల్లో ముగిసిన సంతమార్కెట్ వేలం
- ఓ ప్రజాప్రతినిధి అనుచరుడుకి కాంట్రాక్ట్



నగరపాలక సంస్థలో సంత మార్కెట్ వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: అనంతపురం నగర పాలక సంస్థ ఆదాయానికి గండిపడింది. కనీసం రూ.కోటి వస్తుందనుకున్న చోట రూ.88 లక్షలకే పరిమితం కావడం చర్చనీయాంశంగా మారింది. నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామి చార్జ్ తీసుకున్న రోజుల వ్యవధిలోనే ఇది చోటు చేసుకోవడం గమనార్హం. సంస్థ కార్యాలయంలో మంగళవారం సంత మార్కెట్ వేలం నిర్వహించారు. కేవలం ఇద్దరు కాంట్రాక్టర్లే పాల్గొనడం, 15 నిమిషాల వ్యవధిలోనే వేలం ముగించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రూ.88,15,000 మార్కెట్ లీజు..

నగరపాలక సంస్థలో ఉదయం కమిషనర్ అధ్యక్షతన సంత, దినసరి మార్కెట్ రుసుం వసూలు వేలం పాట నిర్వహించారు. సర్కార్ సవాల్ 88 లక్షలతో వేలం ప్రారంభించారు. అభిలాష్, విజయ్‌కుమార్ అనే కాంట్రాక్టర్లు హాజయ్యారు. ఎటువంటి అనుమతులు లేకున్నా టీడీపీ చోటా నాయకులు అక్కడే పాల్గొన్నారు. కాగా సర్కార్ సవాల్ రూ.88 లక్షలతో మొదలుపెట్టగా, అభిలాష్ అనే వ్యక్తి 88,05000 పాడారు. నిమిషాల వ్యవధిలో విజయ్‌కుమార్ రూ.88,10,000 పాడారు. చివరకు అభిలాష్ రూ.88,15,000 టెండర్ దక్కించుకున్నారు. కేవలం 15 నిమిషాల్లో వేలంపాట ప్రక్రియ ముగిసింది. వాస్తవంగా గతేడాది రూ.88 లక్షలకే లీజు కాంట్రాక్ట్‌ను విజయ్‌కుమార్ దక్కించుకున్నారు. గతేడాదితో పోల్చితే కనీసం రూ.కోటి వరకు సంత మార్కెట్ ఆదాయం రాబట్టాల్సి ఉంది. కాగా నగరపాలక సంస్థ కమిషనర్ ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. ఒక్కమాటలో చెప్పాలంటే ఎప్పుడెప్పుడు వేలంపాటను పూర్తి చేద్దామన్న ధోరణిలో వ్యవహరించారు. గతంలో కమిషనర్లుగా చేసిన వారు రూ.లక్షల్లో నగరపాలక సంస్థకు ఆదాయం రావాలని చూశారు. ఇప్పుడు వేగవంతంగా వేలం పాట ముగించేయడం అనుమానాలకు తావిస్తోంది. ఈ నెల 4న వేలం నిర్వహించగా అప్పుడు అంత పెద్ద మొత్తంలో సర్కార్ సవాల్‌ను ఉంచరాదని వేలంపాటదారులు డిమాండ్ చేయడంతో డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు తిరస్కరించి, వేలం పాటను ఈ నెల 11కు వాయిదా వేసిన విషయం విదితమే.

మూడు దశల్లో చెల్లింపులా?

ఇదిలా ఉండగా సంత మార్కెట్ వేలంపాట దక్కించుకున్న వారు ఒకేసారి పాడిన పాట ప్రకారం డబ్బు చెల్లించాలి. కానీ ఇప్పుడు మూడు దశల్లో డబ్బును చెల్లించేందుకు అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి సిఫార్సు చేసినట్లు సమాచారం. ఇక అదే జరిగితే నగరపాలక సంస్థకు రూ.లక్షల్లో నష్టం వాటిల్లుతుంది. ఏదేమైనా కూటమి ప్రభుత్వంలో అధికారులు ఏకపక్షంగా వ్యవహరించడం విమర్శలకు దారి తీస్తోంది. వేలంలో డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఆర్‌ఓలు లక్ష్మీదేవి, విజయ్‌కుమార్, ఆర్‌ఐలు, తదితరులు పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి



మాట్లాడుతున్న రామాంజనేయులు

అనంతపురం అర్బన్: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో సమాఖ్య జిల్లా కార్యదర్శి సి.వి.హరికృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశానికి రామాంజనేయులతో పాటు సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.లింగమయ్య, చేతివృత్తిదారుల సమాఖ్య, మత్స్యకారుల రాష్ట్ర నేత నాగాంజనేయులు హాజరయ్యారు. రామాంజనేయులు మాట్లాడుతూ రైల్వే, ప్రభుత్వ ఆస్పత్రులు, పోలీసు, తదితర శాఖల్లో దోబీ పనులను రజకులకే కేటాయించాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్‌తో సంబంధం లేకుండా రజక వృత్తిదారుల పిల్లలకు సంక్షేమం అందించాలన్నారు. రజకులపై దాడులకు అడ్డుకట్ట వేస్తూ సామాజిక భద్రత చట్టాన్ని తీసుకురావాలన్నారు. రజకులకు కేటాయించిన భూములు, దోబీఘాట్‌లు కబ్జాకు గురికాకుండా రక్షణ కల్పించాలన్నారు. బీకేఎస్ మాజీ ఉపసర్పంచ్ లలిత, రజక వృత్తిదారుల సమాఖ్య నాయకులు నాగప్ప, నాగరాజు, నారాయణప్ప, భూషణ, వీరాంజి, జయరాం, ఓబుళు, రాయుడు, చిన్నహుసేన్ పాల్గొన్నారు.

మీకు చేతనైతే నా జోలికి రండి

- అక్రమ కేసులకు భయపడే ప్రసక్తేలేదు
- రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: 'మీకు చేతనైతే నా జోలికి రండి. ఆ తర్వాతే మా కార్యకర్తల జోలికి వెళ్లండి. అక్రమ కేసులకు భయపడే ప్రసక్తేలేదు. రైతు ప్రయోజనాలను తుంగలో తొక్కి వారి శవాలపై దోపిడీ చేయాలని చూస్తే అడ్డుకుని తీరుతాం' అని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం అనంతపురం శివారులోని తన క్యాంపు కార్యాలయంలో అనంతపురం రూరల్, రాప్తాడు మండలాల వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 8 నెలల్లో ఏ ఒక్క పథకమూ అమలు చేయలేదన్నారు. చంద్రబాబు ఏమీ చేయలేరని ప్రజలకు అర్థమైందన్నారు. 'తల్లికి వందనం', '18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1,500', 'బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 50 ఏళ్లకే సామాజిక పింఛన్లు', 'మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం', 'రైతులకు రూ.20 వేలు', '9 గంటల నాణ్యమైన కరెంటు' ఇలా ఏ ఒక్క హామీ అమలు చేయలేదన్నారు.

మీ ఇంట్లో తిని పార్టీ కోసం పని చేశారు

మీ ఇంట్లో తిని పార్టీ కోసం పని చేశారని, మీకు రుణపడి ఉంటానని మాజీ ఎమ్మెల్యే పేర్కొన్నారు. వైఎస్సార్ ఆశయ సాధన కోసం జగనన్న పెట్టిన పార్టీలో అందరూ కలిసికట్టుగా ఉందామన్నారు. నా కట్టె కాలేంతవరకూ జగన్‌మోహన్‌రెడ్డితోనే పని చేస్తానన్నారు. తాను బతికున్నంతకాలమూ పరిటాల కుటుంబాన్ని వ్యతిరేకిస్తూనే ఉంటా తప్ప రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. వ్యక్తులుగా ఎవరినీ వ్యతిరేకించనని, ఉద్దేశాలు, సిద్ధాంతాలు, వారి విధానాలు తప్పయితే వ్యతిరేకిస్తానన్నారు. నియోజకవర్గంలో ఎక్కడా చూసినా అక్రమంగా మట్టి తోలుతూ గుట్టలను గుండు కొడుతున్నారన్నారు. తమ ప్రభుత్వ హయాంలో వరుసగా మూడేళ్లు పేరూరు డ్యాంకు నీళ్లు తీసుకొచ్చామని, ఈరోజు పేరూరు డ్యాం కింద పెన్నానది నుంచి రోజూ కర్ణాటకకు ఇసుకను తరలిస్తున్నారన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డిపై వ్యాఖ్యలు అర్థరహితం

- మేయర్ వసీం



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: రాష్ట్ర సమస్యలపై పార్లమెంట్‌లో ప్రస్తావించిన వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డిపై టీడీపీ ఎంపీలు చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని మేయర్ వసీం పేర్కొన్నారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎంపీ మిథున్ రెడ్డి దేశంలోనే అతి పెద్ద మార్గదర్శి చిట్‌ఫండ్ మోసాలు, విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ నిలుపుదల, పోలవరం, రాష్ట్రంలో మెడికల్ కళాశాలల నిర్మాణం పూర్తి వంటి వాటిని పార్లమెంట్ వేదికగా పీఎం నరేంద్రమోదీ దృష్టికి తీసుకెళ్లారన్నారు. ఆయనకు మద్దతుగా నిలవాల్సిన టీడీపీ ఎంపీలు, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు ఎంపీ మాట్లాడారని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇప్పటికైనా కూటమి ఎంపీలు ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని, వారు ఇప్పటికైనా రాష్ట్ర ప్రయోజనాలపై దృష్టిసారిస్తే బాగుంటుందని హితవు పలికారు.

మీటర్ రీడర్ల సమస్యలపై పోరాటం

అనంతపురం అర్బన్: విద్యుత్ మీటర్ రీడర్ల సమస్య సాధనకు దశలవారీగా పోరాటాలు సాగిస్తామని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్ అన్నారు. మంగళవారం స్థానిక సంఘం కార్యాలయంలో మహాసభల పోస్టర్‌ను నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ విద్యుత్ మీటర్ రీడర్ల సంఘం రాష్ట్ర ప్రథమ మహాసభలు ఈనెల 20న విజయవాడలో జరగనున్నాయన్నారు. స్మార్ట్ మీటర్లతో మీటర్ రీడర్లు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. వీరికి విద్యుత్ రంగంలోనే ఉపాధి అవకాశాలు చూపించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, అధ్యక్షుడు చిరంజీవి, మీటర్ రీడర్ల సంఘం రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు కిరణ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు సుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శి రాము, నాయకులు శాన్వాస్, సలీం, బాషా పాల్గొన్నారు.

విత్తన జొన్న రైతులకు 'మద్దతు' ఇవ్వండి



జేడీఏ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నేతలు

అనంతపురం అగ్రికల్చర్: విత్తన జొన్నలు పండించిన రైతులకు మద్దతు ధర ఇచ్చి న్యాయం చేయాలని సీపీఎం అనుబంధ ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు బాలరంగయ్య, హెచ్.రాయుడు మంగళవారం స్థానిక జేడీఏ కార్యాలయంలో టెక్నికల్ ఏఓ బాలనాయక్‌కు వినతి పత్రం అందజేశారు. విడపనకల్లు మండలం హావళిగి గ్రామంలో గత 30 ఏళ్లుగా రైతులు విత్తన జొన్న పండిస్తున్నారని తెలిపారు. దాదాపు 2 వేల మంది రైతుల వద్ద 3 వేల క్వింటాళ్లకు పైగా జొన్నలు ఉన్నా... కొనేవారు లేక నష్టపోతున్నారన్నారు. పంట చేతికొచ్చేదాకా క్వింటా రూ.4,500 వరకు ఉండగా తీరా పంట వచ్చాక రూ.3 వేలు కూడా పలకడం లేదన్నారు. రైతులకు మద్దతు ధర ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఎండోమెంట్ ఏసీపై చర్యలు తీసుకోండి



స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ను కలిసి వినతి పత్రమందిస్తున్న అర్చకులు

అనంతపురం కల్చరల్: అర్చకులను వేధిస్తున్న జిల్లా ఎండోమెంట్ సహాయ కమిషనర్ ఆదిశేషునాయుడుపై చర్యలు తీసుకోవాలని జిల్లా అర్చక సమాఖ్య నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్‌కు వినతిపత్రం అదించారు. ఈ సందర్భంగా జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షుడు వైపీ ఆంజనేయులు మాట్లాడుతూ ఎండోమెంట్ అధికారుల నిర్లక్ష్యం, అవినీతిని ఎండగడుతూ గత నెల 22న ధర్నా చేశామన్నారు. దీన్ని సహించలేని సహాయ కమిషనర్ అర్చకులపైనే కేసులు నమోదు చేయడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. విడపనకల్లు మండలం పాల్తూరు ఉండబండ వీరభద్రస్వామి ఆలయ అర్చకులను రెచ్చగొట్టి కేసులు అర్చకులపై నమోదు చేయించారన్నారు. అర్చక సమాఖ్య ఉమ్మడి జిల్లాల నాయకులు రాజన్న, విజయ్, రామసుబ్బయ్య, చంద్రమౌళి, హనుమంతరాయుడు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

దుష్ప్రచార పోస్టులతో బ్లాక్ మెయిల్

అనంతపురం: సాయి అఖిల్ బాబు అనే వ్యక్తి వ్యాపారంలో భాగస్వామిగా ఉంటూ రూ.లక్షలు మోసం చేయడమే కాకుండా సోషల్ మీడియాలో దుష్ప్రచార పోస్టులతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని డీఎస్పీ రెడ్డి గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకురాలు రేవతి ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న గ్యాస్ ఏజెన్సీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. శ్రీ సత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం చిన్న మొగలాయిపల్లికి చెందిన నరాల సాయి అఖిల్ బాబు తన వ్యాపారంలో భాగస్వామిగా ఉండేవారన్నారు. తాను అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్న సమయంలో తమ ఏజెన్సీలో బ్లాక్ మార్కెటింగ్‌కు తెర తీశాడన్నారు. ఏకంగా 300 సిలిండర్లను అమ్ముకున్నాడని ఆరోపించారు. తన సంస్థలోని మొత్తం సిబ్బందిని తొలగించి, అక్రమంగా గ్యాస్ రీఫిల్లింగ్ చేశారన్నారు. సిలిండర్లు అమ్ముకోవడం వల్ల తాము కంపెనీకి రూ.14 లక్షలు చెల్లించామన్నారు. లేకపోతే ఇప్పటికే డీఎస్పీ రెడ్డి గ్యాస్ ఏజెన్సీ మూతపడేదన్నారు. ఇదే అంశంపై గతంలో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో తమకు న్యాయం జరిగిందన్నారు. అయితే తాజాగా డబ్బు డిమాండ్ చేస్తూ తన ఫొటోలను ఇన్‌స్టాగామ్‌లో పోస్ట్ చేస్తున్నాడని ఆరోపించారు. దీనిపై అనంతపురం వన్‌టౌన్ పీఎస్‌లో ఫిర్యాదు చేశానన్నారు. తన పరువుకు భంగం కలిగిస్తున్న అఖిల్ బాబుపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.

దళిత టీచర్‌కు న్యాయం చేయండి

అనంతపురం ఎడ్యుకేషన్: దళిత టీచర్‌కు న్యాయం చేయాలని రిజర్వేషన్ పరిరక్షణ కమిటీ నాయకుడు ఉజ్వల్ కోరారు. ఈ మేరకు మంగళవారం డీఈఓ ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. డీసీఈబీ కార్యదర్శిగా ఉన్న గిరిజన వర్గానికి చెందిన పురుషోత్తం బాబు తప్పించి అనర్హుడైన గంధం శ్రీనివాసులుకు అవకాశం కల్పించారన్నారు. గతంలో ఏపీఓగా పని చేసిన మంజునాథ్‌పై వచ్చిన పలు ఆరోపణలపై వెనక్కు పంపారని, తిరిగి రొళ్ల మండలంలో పనిచేస్తున్న ఆయనను తీసుకోవడం వెనుక ఆంతర్యమేమిటన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలోనూ ఏపీఓ, ఏఎస్‌ఓలను అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో ఒకే సామాజికవర్గానికి చెందిన వారిని నియమించారన్నారు. ఎస్సీ, ఎస్టీలకు మాత్రం అన్యాయం చేస్తున్నారని వాపోయారు. అందరికీ ఒకే న్యాయం చేసేలా చూడాలని కోరారు.

ఘంటసాలకు ఘన నివాళి



ఘంటసాల మండపంలో ఘంటసాలకు నివాళులర్పిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: అమర గాయకుడు ఘంటసాల 51వ వర్ధంతి సందర్భంగా మంగళవారం పలు చోట్ల సంగీత కచేరీలు, సేవా కార్యక్రమాలతో ఆయన అభిమానులు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక హౌసింగుబోర్డు ఘంటసాల మండపంలో ఘంటసాల సాంస్కృతిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఘంటసాల విగ్రహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. సీనియర్ గాయకుడు బాల కామేశ్వర రావు, డీఆర్వో మలోల, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, నిర్వాహకులు ఓబుళదాసు, జీవీరామయ్య, నాగరాజు, శ్యామసుందరశాస్త్రి ఘంటసాల విశిష్టతను తెలియజేశారు. అనంతలో ఘంటసాల విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్న కళాభిమానులను అభినందించారు. మధ్యాహ్నం అనాథాశ్రమంలో సేవా కార్యక్రమాలు జరిగాయి. మూడోరోడ్డులోని ఘంటసాల భవన్‌లో పాలసముద్రం నాగరాజు ఆధ్వర్యంలో ఆచార్య సుధాకర్, శ్రీదేవి, పద్మజ, బృంద తదితరులతో కలిసి పాత సినిమాల్లోని పాటలను ఆలపించారు. బాలకామేశ్వరరావును గాయనీ గాయకులు సత్కరించారు. సాయంత్రం పద్మశ్రీ ఘంటసాల సంగీత కళాభారతి అధ్యక్షుడు సురేష్ ఆధ్వర్యంలో అనంతపురం క్లబ్ వేదికగా సంగీత విభావరి, ప్రముఖ కళాకారుల సన్మానాలు జరిగాయి.

డీఈఓపై ఒత్తిళ్లు తగదు



సమావేశంలో పాల్గొన్న స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా విద్యాశాఖ అధికారి ఇచ్చిన ఉత్తర్వులను పాటించకుండా ఆయనను మానసిక ఒత్తిళ్లకు గురి చేయడం తగదని ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు మండిపడ్డారు. మంగళవారం సాయంత్రం స్థానిక పాత డీఈఓ కార్యాలయం వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ కొందరు టీచర్లు వారి సొంత పనులు జరగడం లేదని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వారు చెప్పిన వారికి పోస్టింగ్ ఇవ్వలేదని డీఈఓపై కుల సంఘాలు, విద్యార్థి సంఘాల పేరుతో ఇబ్బందులు పెడుతున్నారన్నారు. డీఈఓ విధులకు ఆటంకం కలిగిస్తున్నారన్నారు. ఇలాంటి చర్యలను ఖండిస్తున్నామన్నారు. డీఈఓను మానసిక ఇబ్బందికి గురిచేస్తే విద్యాశాఖ కమిషనర్, కలెక్టర్, ఎస్పీని కలిసి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్యామ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి లోకేశ్వర్‌రెడ్డి, ట్రెజరర్ వంశీబాబు, ఉపాధ్యక్షులు ఎస్.ఇక్బాల్‌బాషా, అనిల్‌కుమార్, ఆదినారాయణ, చెన్నకేశవులు, సురేష్‌నాయక్, జిలాన్, నాగమణి, సరళ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు ఐశ్వర్యేశ్వరస్వామి వ్రతం

అనంతపురం కల్చరల్: స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని మంజునాథస్వామి దేవస్థానంలో బుధవారం అనంత ఐశ్వర్యేశ్వరస్వామి వ్రతం నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు మఠం బసవరాజస్వామి మంగళవారం తెలిపారు. పౌర్ణమి సందర్భంగా ఉదయం సామూహిక వ్రతాలు, మధ్యాహ్నం అన్నదాన సంతర్పణ ఉంటాయన్నారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

సర్పంచ్‌కు సన్మానం



సర్పంచ్ తిరుపాలును సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

రాప్తాడు: రాప్తాడు స్థానిక సర్పంచ్ సాకే తిరుపాలును మంగళవారం వైద్యాధికారి శివకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. తిరుపాలు రిపబ్లిక్ డే సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఉత్తమ సర్పంచుగా అవార్డు తీసుకున్న విషయం విదితమే. దీంతో సర్పంచ్‌ను స్థానిక పీహెచ్‌సీకి ఆహ్వానించి దుశ్శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వికలాంగునికి ల్యాప్‌టాప్ అందజేత

అనంతపురం కల్చరల్: మీనాక్షమ్మ సమ్మిళిత వికాస కేంద్రం వ్యవస్థాపకుడు రవికాంత్ రమణ దివ్యాంగుడైన మాలిక్‌కు ల్యాప్‌టాప్ అందించి ఆదుకున్నారు. దర్శకుడు రషీద్‌బాషా సమక్షంలో మంగళవారం రూ.40 వేలు విలువైన ల్యాప్‌టాప్‌ను అందజేశారు. ఇది తాను బ్యాంక్ ఉద్యోగం పొందడానికి ఉపయోగపడుతుందని మాలిక్ సంతోషం వ్యక్తం చేశాడు.

పిల్లలకు ఇంగ్లిష్‌లో బోధించండి

ఆత్మకూరు: అంగన్‌వాడీల్లో చిన్నారులకు ఇంగ్లిష్‌లో బోధించాలని సీడీపీఓ ధనలక్ష్మి సిబ్బందికి సూచించారు. మంగళవారం పి.యాలేరు, సిద్దరాంపురం అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లోని రికార్డులను పరిశీలించారు. పిల్లలు ఎంత మంది ఉన్నారు? బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం సక్రమంగా అందుతోందా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పిల్లల బరువును పరిశీలించారు. పిల్లలకు ఆటల రూపంలో విద్య నేర్పించాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయలక్ష్మి

రాప్తాడు: గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం ఎంపీడీఓ బి.విజయలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం రాప్తాడు, ప్రసన్నాయపల్లిలో జరుగుతున్న ఉపాధి పనులను ఆమె పరిశీలించారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఉపాధి పనులు కల్పిస్తామన్నారు.

ప్రతి రైతుకూ యూనిక్ ఐడీ తప్పనిసరి

అనంతపురం అగ్రికల్చర్: ప్రతి రైతూ తప్పనిసరిగా యూనిక్ ఐడీ తీసుకోవాలని రూరల్ ఏఓ జే.శశికళ సూచించారు. మంగళవారం రూరల్ మండలం జంగాలపల్లి, కందుకూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఇక నుంచి ప్రభుత్వం నుంచి ప్రయోజనం పొందేందుకు ప్రతి రైతుకూ ఒక కొత్త ఐడీ ఇస్తారన్నారు. పంట నమోదు, పీఎం కిసాన్, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, విత్తన రాయితీలు, యాంత్రీకరణ రాయితీలు, పంట ఉత్పత్తుల అమ్మకాల కోసం ఐడీ తప్పనిసరి అన్నారు. ఆధార్ తరహాలో సాగు భూమి కలిగిన రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ ఐడింటిఫికేషన్ నంబరు తీసుకోవాలని సూచించారు. రైతులు వెంటనే ఆర్‌ఎస్‌కేల్లో సంప్రదించి ఆధార్, లింక్ అయిన ఫోన్ నెంబరు, పట్టాదారు పాస్‌పుస్తకం అందించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఇక రబీలో సాగు చేసిన వేరుశనగ పంటకు ప్రస్తుతం ఎకరాకు 200 కిలోల జిప్సం వేసుకుంటే మంచి దిగుబడులు వస్తాయన్నారు. సూక్ష్మపోషకాల లోప నివారణకు రబీ పంటలకు ప్రస్తుతం హెక్టార్‌కు 25 కిలోలు జింక్ సల్ఫేట్ పైపాటుగా వేసుకోవాలన్నారు. పురుగుల నివారణకు వేపనూనె పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఏఈవోలు మురళీక్రిష్ణ, ఆలేఖ్య, ఆర్‌ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.